# బొండు మల్లెలు

ఊళ్ళో పువ్వులకి మంచి ధర ఉన్నది. ఊరికేవుంది మా వెనక పెరడు. మంచిలాభం వస్తుందని మల్లె పెరడు వెయ్యడానికి నిశ్చయించాను.

మల్లెలమ్మి డబ్బు చెయ్యడంలో కొంత ప్రపంచాన్ని దోపిడీ చెయ్యడముంది. అయినా ఆ దోపిడీ న్యాయంగా కనబడ్డది. ధనికులే-అనగా ప్రజలని దోపిడీచేసి ఐశ్వర్యవంతు లయినవాళ్ళే నా మల్లెలు కొంటారు. అంచేత నేను దోపిడీ చేస్తున్న వాళ్ళని మల్లెలతో దోపిడీ చేస్తాను.

పెరట్లో గోతులు తవ్వడానికి ఒక కూలివాడి అవసరం పడ్డాది. నాలుగు రోడ్లమధ్య కెళితే పొట్టవెన్నుకంటుకుపోయిన ముసలివాడు యెదురుగా వచ్చాడు.

"పనుందా బాబూ?" అనడిగేడు.

"నువ్వు చెయ్యలేవు" అన్నాను. రెండేసి మూళ్ళ లోతుని గోతులు గునపంతో తవ్వాలి. మన్నూ మశానం వాటిలో కెత్తి బొండు మల్లె కుదపలు పాతాలి.

"ఏం పని బాబూ?" అన్నాడు.

"గునపంతో తవ్వాలి."

"తవ్వేస్తాను బాబూ" అన్నాడు. తాత తరమా? ముష్కరమైనవాడైతే అయిదు రోజులు చేస్తాడు. తాత పదిరోజులకైనా చెయ్యలేడు. అతన్ని తీసికెళ్ళడం శుద్ధ దండుగ.

"పోనిస్తూ" అన్నాను.

"పని యేటో సూడనీయండి. మొత్తాన్ని సేసుకుంటాను. తమకి తోసింది ఇయ్యండి" అన్నాడు. అతని జాలికరమైన మొహంలోకి చూడగానే, యిష్టం లేకపోయినా కాదనలేకపోయాను.

"సరే" అన్నాను. వెంటపడ్డాడు. పని చూసుకొన్నాడు. పాపం చాలా తక్కువే అడిగేడు. బలమైనవాడికి ఐదురోజులపని. అంతకు ఎక్కువే ఇవ్వొచ్చు.

బాగా తగ్గించి అడిగాను.

"కష్టం చూడండి బాబయ్యా" అన్నాడు.

"నాతో ఇన్ని బేరాలు లేవు"

"సరే తమసిత్తం. మద్దేన్నంవేనా తమరు ఇడిచిపెట్టేది, ఇంత గెంజి పొయ్యండి" అని ప్రాధేయపడ్డాడు.

"పోస్తానులే" అన్నాది నా పెళ్ళాం. చవకగా కుదిరేడని గ్రహించింది కాబట్టే ఆ అభిమానం! ఇంట్లో రోజూ సీరు గంజి వారుతుంది. వీధి కాలువలోకి వొదిలిపెడుతున్నదే. తాతకి పోసినవల్ల నష్టంలేదు. సారవంతమైన గంజిని కాలువపాలుచేసి పిప్పిని "అన్నం" అనుకొని నాగరికులం తింటాం.

తాత పదకొండురోజులకిగాని పని పూర్తి చెయ్యలేకపోయాడు. తాతకి నోరూ వాపీలేదు. ఎలాగచెపితే అలాగ తవ్వేడు. అనుకొన్న ప్రకారం డబ్బు యిచ్చేను. ఎక్కువ అడుగుతాడనుకున్నాను. గునుస్తాడనుకున్నాను. అల్లరి చేస్తాడనుకున్నాను. ఏమీలేదు. నోరు కదపకుండా పట్టుకుపోయాడు. కాని మర్నాడే "పని సెప్పరా?" అంటూ వొచ్చాడు.

"మొక్కలకు నీళ్ళు పోస్తావా?" అనడిగాను.

"పోస్తాను" అన్నాడు. నూతులో నీళ్ళు తోడాలి. మోసుకెళ్ళిపోయాలి.

"నెలకేమివ్వ మన్నావు?"

"తమ సిత్తం."

నెల కింత అని చెప్పేను.

"సిత్తం" అని ఇంకేదో చెప్పబోయాడు.

"ఏంటి తాతా?"

"...ఏటడుగుతాను?....తమ రొగ్గేసినది" అని నసికినసికి, "గంజి నీళ్ళు" అన్నాడు.

తాత కుదురుకున్నాడు. మాకు తేరగా దొరికేడు. తాతకి నోరూ వాపీ లేదు. ఏం చెప్పినా చేసేవాడు. చీకటితో టొచ్చేవాడు. చీకటి పడుతుంటే వెళ్ళేవాడు. పగలల్లా ఏదోపని చేస్తూనే వుండేవాడు. మధ్యాహ్నం గంజి పోసేవాళ్ళం. తాత గెంజిలోకి పిల్లలు దిగవిడిచిన అన్నం కెరట్లకూడా వెళ్ళేవి. తాత నంజుకోడానికి విస్తళ్ళలో దిగబెట్టిన కూరలు, పాచిపట్టిన పచ్చళ్ళు వెళ్ళేవి.

నెలజీతం అందుకొన్న మరునాడు తాత మొహం పరమానందంగా ఉంది.

'నా దినం తీరుతాదిబాబూ' అని నాతో చెప్పేడు.

"ఏంటి విశేషం తాతా?"

"తమరిచ్చిన జీతం నేతిలెట్టాను. రేత్రి నా కూతురు పట్టిడన్నం పెట్టింది."

"రోజూ పెట్టడం లేదూ?"

"నేదు బాబూ, తమ పాదాలసాచ్చి, తమరింట్లో గంజి మెతుకులు తప్ప కడుపు కింకేటీనేదు."

నా వొళ్ళు కంపించింది.

"తాతా నీ కూతురుదగ్గరా ఉన్నావు?"

"సిత్తం"

"కొడుకుల్లేరూ?"

"కొడుకుండేవాడు, సచ్చిపోనాడు. నా నద్దానమైపోనాను. కోడలు ఏరే కాపురం సూసుకుంది."

"కూతురు తిండి పెట్టిందికాదేం?"

"కూడెట్టిందికాదు, డబ్బు నెడ్డపాపిస్టి. తల్లీ పిల్లల ఆశలు సంపు తాది. రేత్రి జీతమంతా నేతిలెట్టినాను. పట్టెదన్నం పెట్టింది. ఇంక దినం తీరుతాది" అన్నాడు.

ఆ రోజునుంచి తాత మా యింట్లో మనిషి అయిపోయాడు. తాత మీద ఇంటిల్లపాదికి జాలికలిగింది. ఇంత అన్నంకూడావేసి ఆదరిస్తున్నారు.

మల్లెలు మొగ్గలు తొడిగేయి. మొగ్గలు అమ్మడం ఆరంభించేము. మధ్యాహ్నం బుట్టతో పట్టుకెళ్ళి తాతే అమ్ముకొచ్చేవాడు, సోలడు మొగ్గలు యింతా అని. బుట్టెడు మొగ్గలయేవి.

మల్లెలు రెండు విడతలు పూశాయి. తోటవల్ల మూడు వందల రూపాయలు లాభం వచ్చింది. దాగరంత దొడ్డికి తాత జీతం పోను ఆ లాభం వచ్చింది. నేను చవగ్గా మొగ్గలమ్మేశాను. బొండుమల్లెలు సోల అణా ఏం? బేడన్నా కొందురు. అణాన్నరైనా చేయవలసింది. తెలిసింది కాదు.

వృద్ధి అయిన తరువాత మల్లెతోట ఎంతో సరదావేసింది. నా మల్లెలు ఎంతోమంది యువతులు ధరించేరు, ఆనందించేరు. నేను రసజీవిని. అంచేత యువతుల వాల్జడలో బొండుమల్లెలు వికసించటం నాకెంతో మక్కువ.

తొలకరికి మరి తాత పనిలోకి రాలేదు. తాత భోగట్టా చెప్పేవారెవరూ లేకపోయారు. అన్నాళ్లు పనిచేసేడుకాని, అతని ఇల్లెక్కడో మేము కనుక్కోలేదు. తాత తాత అండమే తప్ప మాయింట్లో యెవరికీ అతని పేరు తెలియదు. అంత చిత్రంగా ఉంటాయి మన సంబంధ బాంధవ్యాలు.

చాలకాలమైన తరువాత వంకాయలమ్మే మనిషి 'మీ దొడ్లో మల్లెమొక్కలు బాగున్నాయా' అని అడిగింది. మల్లెమొక్కలున్నట్లు నీకెలాగ తెలుసు ననడిగేను—

"మీ దొడ్లో తాత పనిచేసేవోడుకాదా?"

"తాత నెరుగుదువా?"

"ఆళ్ళది మాయూదే"

"తాత బాగున్నాడా?"

"సచ్చిపోనాడు. మీకు తెల్దా?"

"చచ్చిపోయాడా! ఎప్పుడు?"

"అబ్బో శాన్నాళ్ళయింది. ఇంకా బతుకును బాబూ! జబ్బుచేసి నిమ్మళించింది. తరవాత కూతురు సూసిందికాదు. డాక్టేరుగారు పళ్ళూ జావలు ఎట్టమన్నారు. నాకాదెక్కడదని వొగ్గేసింది. సచ్చిపోనాడు. ఆ కూతురు సెడ్డ ఘటుకురాలు." అన్నాది.

కూతురిని అనవలసిన పనిలేదు. దానికోటి వుందో లేదో? ఎంత తండ్రి అయినా పెట్టడాని కుండాలా? లేమి ఎంతటి వాళ్ళలోనైనా మానవత్వాన్ని చంపి అమానుషత్వాన్ని పెంచుతుంది. వృద్ధులకి పెన్షనులైనా ప్రభుత్వం ఇస్తే బావుణ్ణు. జీవితబీమా ఉన్నా బావుణ్ణు.

తాత వృత్తాంతం ఆలోచించినకొద్దీ నేనే ద్రోహం చేసినట్టు బాధపడ్డాను. బొండుమల్లెలు వేసింది, పెంచింది, డబ్బుచేసింది తాతే? వచ్చిన ఫలితం నేను చల్లగా జేబులో వేసుకొన్నాను. ఆ డబ్బంతా తాత ఆర్జన కాదూ? ఆ డబ్బే తాతదైతే ఎంత సుఖపడును? అవసానకాలంలో జరక్కపోనా? దోపిడీ చేస్తున్న వాళ్ళకి బొండుమల్లెలమ్మి దోపిడీ చేస్తున్నాననుకొన్నాను కాని, తాతని పెద్ద దోపిడీ నేనే చేసేను. నెలకి నాలుగు రాళ్ళు జీతం ఇచ్చి రోజుకిన్ని గంజినీళ్లుపోసి సాగనంపాను. దొడ్డి నాది ఫలితం కష్టపడ్డ వాడికి కాకుండాపోయింది.